ప్రజాశక్తి

మంగళవారం 31 అక్టోబర్ 2023

5

అల్లూరి సీతారామరాజు



పారదర్శకంగా సివిల్స్ ఉచిత శిక్షణ ఇంటర్వ్యూలు : పిఒ

ప్రజాశక్తి-పాడేరు: పారదర్శకంగా సివిల్స్ ఉచిత శిక్షణ ఇంటర్వ్యూలు నిర్వహించామని ఐటిడిఎ పిఒ వి. అభిషేక్ తెలియజేసారు. సివిల్స్ ఉచిత శిక్షణకు రెండు విడతలలో నిర్వహించిన రాత పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 156 మంది అభ్యర్థులను ఇంటర్వ్యూకు అధికారులు ఎంపిక చేశారు. వీరికి ఈనెల 29, 30 తేదీలలో ఐటిడి ఏ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ అధికారి మాట్లాడుతూ, మొదటి రోజు 95 మంది అభ్యర్థులను రెండవ రోజు 55 మంది అభ్యర్థులను ఇంటర్వ్యూలు జరిపినట్లు వెల్లడించారు. ఆల్ ఇండియా రేడియో రిటైర్డ్ అదనపు సంచాలకులు అనంత పద్మనాభరావు, మేఘాలయా రిటైర్డ్ అదనపు డిజిపి, పి. హెచ్.పి .రాజు అభ్యర్థులను పారదర్శకంగా ఇంటర్వ్యూలు జరిపినట్లు తెలిపారు. వీరిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 50 మంది అభ్యర్థులను ఎంపిక చేసి నవంబరు మొదటి వారంలో వేపగుంట యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణ ప్రారంభిస్తామని చెప్పారు. శిక్షణకు ఎంపికైన అభ్యర్థులు ఐటిడిఏ అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకుని ఉన్నత ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఓటర్ల తొలగింపులో జాగ్రత్తలు పాటించాలి

- భూముల రీ సర్వే డేటాను ఆన్‌లైన్ చేయాలి- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశం

ప్రజాశక్తి-పాడేరు: భూముల రీసర్వే డేటాను వేగంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి సబ్ కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు, సర్వే అధికారులతో భూ సర్వే, మ్యుటేషన్లు, చెట్లు కటింగ్ అనుమతులు, అస్సైన్మెంట్ భూములకు డి.ఫారం పట్టాలు పంపిణీ, ఓటరు జాబితా తయారీ, కొత్త ఓటర్ల నమోదు, మృతి చెందిన ఓటర్ల తొలగింపు ప్రక్రియపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూ హక్కు పత్రాల ఇకెవైసీని నిర్ధిష్టమైన గడువులోపు పూర్తి చేయాలని స్పష్టం చేసారు. తహశీల్దారులు, బిఎల్ఓలు, వి.ఆర్ . ఓలు మరొక సారి పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ నిర్వహించడానికి అవసరమైన అన్ని సౌకర్యాలు ఉన్నాయా ? లేదా ? గతంలో ఎన్నికలు నిర్వహించారా అనే అంశాలను పరిశీలించి నివేదిక సమర్పించాలని సూచించారు. నవంబరు 4, 5 డిసెంబరు 2, 3 తేదీలలో ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు నిర్వహించి కొత్త ఓటర్లను నమోదు చేయాలని చెప్పారు. ఓటరు తొలగింపు ప్రక్రియలో తగిన జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. ఓటరు జాబితా లో అర్హులైన ఓటర్లు నమోదు, ఓటర్ల తొలగింపు ప్రక్రియపై రాజకీయ పార్టీల నేతలతో సమావేశాలు నిర్వహించాలని తాహశీల్దారులకు సూచించారు. చెట్లు నరకడానికి వచ్చిన ప్రతిపాదనలు వెంటనే సమర్పించాలని చెప్పారు.ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ జె. శివ శ్రీనివాసు, పాడేరు ఇన్చార్జి సబ్ కలెక్టర్ వి. అభిషేక్ ,రంపచోడవం సబ్ కలెక్టర్ శుభం బన్సల్, సర్వే సహాయ సంచాలకులు వై. మోహన రావు, 22 మండలాల తహశీల్దారులు, సర్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్



ఐటిడిఎ పిఒ చైతన్యకు వినతి పత్రం ఇచ్చి సమస్యను వివరిస్తున్న సిపిఎం నాయకులు

రోడ్ల సమస్యలపై పిఒకు సిపిఎం వినతి

ప్రజాశక్తి-విఆర్.పురం

విఆర్.పురం మండలంలోని రోడ్ల సమస్యలపై చింతూరు ఐటీడీఏ కార్యాలయం వద్ద పిఒకు సిపిఎం ఆధ్వర్యాన సోమవారం వినతిపత్రం అందజేశారు. పెద్దమట్టపల్లి నుండి కుందూలూరు వరకు బిటి రోడ్డు, తెల్లంవారిగూడెం నుండి గుల్లేటివాడ వరకు బిటి రోడ్డు, పెద్దమట్టపల్లి నుండి భుర్గువాడ వరకు, ఉమ్మిడివరం నుండి గుర్రంపేట మీదుగా నూతిగూడెం వరకు, రామవరం నుండి కారంగూడెం వరకు, కుందులూరు నుండి కుంజావారిగూడెం మీదుగా జల్లివారిగూడెం వరకు, గొల్లగూడెం నుండి విపి.కుంట వరకు రోడ్లు వేయాలని కోరారు. దీనికి పిఒ స్పందించి త్వరలోనే రోడ్ల సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎంకు చెందిన విఆర్.పురం ఎంపీపీ కారం లక్ష్మి, రేఖపల్లి సర్పంచ్ పూనెం సరోజిని, పెద్దమట్టపల్లి సర్పంచ్ వెట్టి లక్ష్మి, రామవరం సర్పంచ్ కారం బుచ్చమ్మ, ములకనపల్లి సర్పంచ్ సవలం మారయ్య, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, నాయకులు వడ్లాది రమేష్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత

-ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర

-పాడేరులో వైసిపి సామాజిక సాధికార బస్ యాత్ర

ప్రజాశక్తి పాడేరు:- అట్టడుగు వర్గాల అభివద్ధి కోసం వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత నిస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పి.రాజన్నదొర తెలిపారు. వైయస్సార్ కాంగ్రెస్ చేపట్టిన సామాజిక సాధికార యాత్ర సోమవారం పాడేరులో నిర్వహించారు. ఈ సందర్భంగా పాడేరు మెయిన్ రోడ్‌లో ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పేదల సంక్షేమం, అభివృద్ధి పట్ల ప్రత్యేక శ్రద్ధతో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నారని చెప్పారు. గిరిజన సంక్షేమ శాఖ ద్వారా అభివృద్ధి కోసం రూ, 17వేల 134 కోట్లు ప్రత్యక్షంగా పరోక్షంగా ఖర్చు చేసినట్లు ఆయన తెలిపారు. నాడు నేడు ద్వారా పాఠశాలల అభివృద్ధి ఆంగ్ల విద్యాబోధన విద్యా వైద్య మౌలిక సదుపాయాల కల్పన కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గిరిజనుల అభివృద్ధి పథకాల కోసం ప్రభుత్వం గత ఐదేళ్లలో 20 వేల కోట్లు ఖర్చు చేసిందని చెప్పారు.

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పంచాయతీరాజ్ శాఖ మంత్రి బూడి ముత్యాల నాయుడు మాట్లాడుతూ, గిరిజనుల విద్య, ఆరోగ్యం పట్ల సీఎం జగన్ ప్రత్యేక దృష్టి సారించారని, ఇచ్చిన హామీ మేరకు పాడేరులో 500 కోట్లతో మెడికల్ కళాశాలను నిర్మించడం విశేషమని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వైవి సుబ్బారెడ్డి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ గిరిజన సంక్షేమ శాఖ మాత్యులు పసుపులేటి బాలరాజు, అరకు ఎంపీ జి.మాధవి, జడ్పీ చైర్మన్ సుభద్ర, ఎమ్మెల్సీ రవిబాబు, అరకు ఎమ్మెల్యే శెట్టి పాల్గణ, వైయస్సార్సీపి ఎస్టి సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు మత్స్యరాస వెంకటలక్ష్మి, జీసీసీ చైర్ పర్సన్ శోభా స్వాతి రాణి, నియోజక వర్గంలోని వివిధ మండలాల వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

సచివాలయం ప్రారంభం

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని మట్టుజోరు పంచాయతీలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయంను అరకు ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ ఎంపీపీ కూడా రాజబాబు, ఎంపీడీవో.ఆర్ వెంకట్రావు, స్థానిక సర్పంచ్ సాంబలతో కలిసి సోమవారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ మాట్లాడుతూ, సచివాలయం వ్యవస్థ ద్వారా మరింత సేవలు అందుబాటులో తేవాలని ఆయన కోరారు. ప్రజలకు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండే విధంగా ఏర్పాటు చేశారన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అందుబాటులో ఉండి పనులు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో అరుకు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సివేరీ కొండలరావు, ఎంపీటీసీ పరదాని భీమలింగేస్, జిల్లా వైసీపీ పార్టీ ఉపాధ్యక్షులు. పాంగి సింహాచలం, వైసీపీ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి.జర్సింగి సూర్యనారాయణ, సిడిపిఓ సిహెచ్ బాలామణి దేవి, అగ్రికల్చర్ ఆఫీసర్ లీలావతి, తహసిల్దార్ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు వింటున్న సబ్ కలెక్టర్ శుభం బన్సల్

స్పందనకు 50 అర్జీలు

ప్రజాశక్తి-రంపచోడవరం

స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 50 అర్జీలు అందాయి. వీటిని రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్, ఐటిడిఎ ఏపీఓ సిహెచ్ శ్రీనివాసరావు స్వీకరించారు. రంపచోడవరం మండలం ఐ.పోలవరం గ్రామం నుండి ఏర్పాటు చేసిన 516ఇ నేషనల్ హైవే రోడ్డుకి ఇరువైపులా చెట్లు, ఇండ్లు నష్టపోయిన బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని 60 మంది బాధితులు విన్నవించారు. పాడి గేదెలు కొనుగోలు చేసి చేయడానికి రుణాలు మంజూరు చేయాలని దేవీపట్నం మండలం, పోలవరం ప్రాజెక్టు ముంపు బాధితుడు మడకం రామన్న దొర, భూపతిపాలెం ప్రాజెక్టు ద్వారా దొరమడుగులు గ్రామానికి చెందిన 70 మంది రైతులకు 200 ఎకరాలకు సాగునీరు ఏర్పాటు చేయాలని ఆ గ్రామస్తులు దరఖాస్తు చేశారు. భూ సమస్యలు, ఉపాధి అవకాశాలు, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ వంటి వాటి కోసం కొన్ని దరఖాస్తులు వచ్చినట్లు సబ్ కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జాన్‌రాజ్, డిఎస్ శాస్త్రి, డివిజనల్ పంచాయతీ అధికారి రాఘవన్, ఏడిఎంహెచ్ఓ జి.ప్రకాశం. వెలుగు ఎపీడీ ఎ.శ్రీనివాసరావు, పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సిహెచ్‌కెవి.చౌదరి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీ చేపడుతున్న నేతలు

బస్ యాత్రను విజయవంతం చేయాలి

- సిపిఎం నేతల ముమ్మర ప్రచారం

ప్రజాశక్తి -అరకులోయ : నవంబర్ 2 న ప్రజా రక్షణ బేరి బస్సు యాత్రను విజయవంతం చేయాలని అరకులోయ మండలం లో నాయకులు కార్యకర్తలు బైక్ యాత్ర నిర్వహించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.రామారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజా రక్షణ బేరి పేరుతో సిపిఎం చేపట్టిన బస్సు యాత్ర అరకులోయ మండల కేంద్రంలో నవంబర్ 2న గురువారం చేరుకుంటుందన్నారు. కాఫీ రైతులకు గిట్టుబాటు ధర చెల్లించాలన్నారు. మిరియాలు కిలో రూ. 1000, కాపీ ధర కిలో రూ.500, కాఫీ పళ్ళు రూ.100 చొప్పున ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.విద్య, వైద్యం పేదలకు ఉచితంగా అందించాలన్నారు. పండించిన పంటలకు గిట్టు బాటు ధర, కోల్డ్ స్టోరేజ్ వంటి సమస్యలు పరిష్కారం చేయాలన్నారు. అటవీహక్కుల చట్టం ప్రకారం ప్రతి ఒక్కరికి పోడు పట్టాలు మంజూరు చేయాలని, జీవో 3కు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీలో చెక్ డ్యాముల మరమ్మతు చేయాలన్నారు.మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు సిహెచ్ గురుమూర్తి, జె.భగత్ రామ్, నానిబాబు, మగ్గన్నా, రామన్న, కె.మొద్దు, కుమారి, బాలక్రిష్ణ, దొన్ను,తదితరులు పాల్గొన్నారు.

పెదబయలు: ప్రజా రక్షణ బేరి యాత్రను జయప్రదం చేయాలని మండల కేంద్రంలో సిపిఎం కార్యాలయంలో పోస్టర్స్ ఆవిష్కరంచారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బోండా సన్నిబాబు మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రజలు, కార్మికులు, గిరిజనులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న ప్రజా సమస్యలు పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా సిపిఎం ఆధ్వర్యంలో ప్రజా రక్షణాబేరి బస్సుయాత్ర లు ప్రారంభించడం జరిగిందన్నారు. బిజెపి మతోన్మాద విధానాలని తిప్పికొట్టాలన్నారు. గిరిజన హక్కులకు రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు తూట్లు పొడుస్తున్నాయన్నారు.ఈ యాత్ర నవంబర్ 3 న పెదబయలుకు చేరుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ బోండా గంగాధరం పాల్గొన్నారు.

బోరు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- పెదబయలు : మండల కేంద్రంలోని గ్రంథాలయంలో అల్లూరి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఐదు లక్షల రూపాయలు మంజూరు చేయడంతో సర్పంచీ పి.మాధవరావవు సోమవారం బోరు నిర్మాణానికి శంకుస్థాపన చేశారని గ్రంథాలయధికారి ఓ,శ్రీనివాసరావు విలేఖరులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ కె బొంజుబాబు పాల్గొన్నారు.



శంకు స్థాపన చేస్తున్న సర్పంచ్ మాధవరావు

విలీన మండలాలను

కరువు ప్రాంతాలుగా ప్రకటించాలని ధర్నా



ఐటిడిఎ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సిపిఎం ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు

ప్రజాశక్తి-చింతూరు

పోలవరం విలీన చింతూరు, విఆర్.పురం, కూనవరం, ఎటపాక నాలుగు మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి నష్టపోయిన పంటను సర్వే చేసి వెంటనే పరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన ఆ పార్టీ ప్రజా ప్రతినిధులు, ప్రజలు సోమవారం స్థానిక ఐటిడిఎ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ విలీన నాలుగు మండలాల్లో రైతులు వేసుకున్న వరి, మిర్చి, పొగాకు, పత్తి పంటలు మొత్తం వర్షాలు లేక పూర్తిగా ఎండిపోయాయని, వాటికి నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. అనంతరం ఐటిడిఏ పిఓకి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో విఆర్.పురం ఎంపీపీ కారం లక్ష్మి, కూనవరం వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, సర్పంచులు పూనెం సరోజిని, కారం బుచ్చమ్మ, సవలం మారయ్య, వెంకమ్మ, శంకర్, ఎంపీటీసీలు అమ్మాజీ, జయసుధ, ముర్రం లక్ష్మి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మేకల నాగేశ్వరరావు, పల్లపు వెంకట్, పాయం సీతారామయ్య, నాయకులు కర్నాటి శ్రీనివాస్, నాగరాజు, బాబురావు, రమేష్, పిడగయ్య, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

వర్షాల్లేక పంటలు ఎండిపోయిన పంటలను సర్వే చేసి నష్టపోయిన పంటకు పరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని సిపిఎం తులసిపాక శాఖ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు సిపిఎం మండల కమిటీ సభ్యులు మడకం చిన్నయ్య, గ్రామ శాఖ కార్యదర్శి కలుముల ముత్తయ్య ఆధ్వర్యంలో సిపిఎం బృందం గ్రామంలో ఎండిపోయిన పంటలను పరిశీలించి మీడియాకు తెలియజేశారు. గ్రామంలో గిరిజన రైతులు వేసుకున్న పంటలు మొత్తం వర్షాలు లేక పూర్తిగా ఎండిపోయాయని తెలిపారు. జగన్ ప్రభుత్వం ఇచ్చే నాలుగు నెలల పంట విత్తనాలు వల్ల పంట చేతికి రావడం లేదన్నారు. పూర్తిగా వర్షాలపై ఆధారపడి వేస్తున్న ఈ ప్రాంత వాసులకు మూడు నెలలకు వచ్చే పంట విత్తనాలను అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోడియం అప్పారావు, కలుముల లక్ష్మయ్య, సవలం రామయ్య, సవలం దుర్గారావు, సవలం లక్ష్మయ్ తదితరులు పాల్గొన్నారు.



ఎండిపోయిన వరి పొలాన్ని పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు, రైతులు

గుంటూరు, విజయవాడకు బస్సు నడపాలని వినతి

ప్రజాశక్తి-కూనవరం

వర రామచంద్రాపురం మండల రేఖపల్లి నుండి కూనవరం మీదుగా విజయవాడ, గుంటూరుకు బస్సు సర్వీస్ నడపాలని కూనవరం గ్రామానికి చెందిన నాయకులు సోమవారం విజయవాడ వెళ్లి ఎపిఎస్ఆర్‌టిసి డిపిటిఓను కలిసి వినతిపత్రం అందజేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్నప్పుడు భద్రాచలం డిపో వారు విజయవాడ, గుంటూరు వెళ్ళడానికి కూనవరం, విఆర్.పురం నుండి బస్సు సర్వీస్ నడిపేవారని, రాష్ట్రం విడిపోయిన తర్వాత ఆ సర్వీసును రద్దు చేశారని తెలిపారు. అప్పటి నుండి కూనవరం, విఆర్.పురం మండలాలకు విజయవాడ బస్సు సౌకర్యం లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ బస్సు సర్వీసు ఏర్పాటు చేస్తే వ్యాపారస్తులకు, మిర్చి రైతులకు, ఉద్యోగస్తులకు, అందరికీ ఎంతో సౌకర్యార్థకరంగా ఉంటుందని చెప్పారు. ఈ రెండు మండలాలకు బస్సు సౌకర్యం గురించి గతంలో అనేకసార్లు వినతి పత్రాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. దానికి డిపిటిఓ సానుకూలంగా స్పందించి రూటు పరిశీలించి ఏర్పాటు చేస్తామని తెలియజేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు వెంకట్రావు, ఎంవివి రాజు, నాగేశ్వరరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌టిసి డిపిటిఓకు వినతిపత్రం ఇస్తున్న కూనవరం గ్రామస్తులు

ఏ నైతిక విలువలతో బస్సు యాత్ర చేస్తున్నారు?

ప్రజాశక్తి-కొయ్యూరు

వైసిపికి చెందిన గిరిజన ప్రజాప్రతినిధులు గిరిజన జాతికి ఏమి చేశారని, ఏ నైతిక విలువలతో బస్ యాత్ర చేస్తున్నారో చెప్పాలని జనసేన అరకు పార్లమెంటు నియోజకవర్గం ఇన్‌ఛార్జి వి.గంగులయ్య ప్రశ్నించారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ బిసి ఉపకులాలైన బోయవాల్మీకి, బెంతు ఒరియాలను ఎస్టీ జాబితాలో చేర్చి అసలైన గిరిజన జాతి అస్తిత్వంపై అత్యాచారం చేశామని విజయసూచికగా ఈ బస్సు యాత్ర చేస్తున్నారా? జిఒ3 పునరుద్ధరణకు రివ్యూ పిటిషన్ వేసి రక్షించినందుకు విజయ దరహాసంతో చేస్తున్నారా? గిరిజన హక్కులు, చట్టాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నా పట్టించుకోకుండా, ప్రభుత్వాలను ప్రశ్నించకుండా కట్టుబానిసత్వం ప్రకటించి గిరిజనుల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టినందుకు బస్సు యాత్ర చేస్తున్నారా అని ప్రశ్నించారు. ఆదివాసీ భాషా వాలంటీర్లను తొలగించి గిరిజన భాష అస్తిత్వాన్ని దెబ్బతీస్తున్నందుకా? గిరిజన ప్రజలకు వచ్చే 27 పథకాలను రద్దు చేసినందుకా? ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లించినందుకా? విద్యార్థులకు కార్పొరేట్ విద్యనందించే బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకాన్ని రద్దు చేసినందుకా? ఈ బస్సు యాత్ర చేస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ యాత్రకు ఒక్క గిరిజనుడు కూడా హాజరు కాలేదన్నారు. కాలేరు. ఇప్పటికైనా గిరిజనులు మేలుకొని వైసిపి రాక్షసపాలనను అంతమొందించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు సాగిన బుజ్జిబాబు, గోకిరి శ్రీను, లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

కళ్లకు గంతలు కట్టుకొని టిడిపి నిరసన

ప్రజాశక్తి-కొయ్యూరు

టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టుకు నిరసనగా నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా కొయ్యూరు గాంధీ బొమ్మ సెంటర్లో టిడిపి నాయకులు ఎంవివి ప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి కళ్ళకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో కొయ్యూరు సర్పంచ్ మాకాడ బాలరాజు, మేడిపోయిన చక్రధరరావు, వాసం రాము, రేవళ్ల అప్పారావు, మొట్టడం వీరయ్య దొర, గాలి రాజు, పడాల వీరభద్రరావు, బస తాతబ్బాయి, ముప్పిడి సూరిబాబు, ఉబ్బల మరిడయ్య ఆకుల అప్పారావు, వార్డు మెంబర్లు ఎం.వరలక్ష్మి, సాగిన లక్ష్మి, సొరబోయిన రామలక్ష్మి, రాజశేఖర్, ఎ.నాగేశ్వరరావు, వజ్రపు సత్తిబాబు, జనసేన కార్యకర్తలు. అనిశెట్టి నాని, జి.గణేష్, శివ, ధనుష్ పాల్గొన్నారు.



కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలుపుతున్న టిడిపి కార్యకర్తలు

టిడిపి నేతల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న టిడిపి నేతలు, కార్యకర్తలు

ప్రజాశక్తి-చింతపల్లి : చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా మండలంలోని వంగాడ్ల కొత్తూరు గ్రామంలో నిజం గెలిపిద్దాం.. కళ్ళు తెరిపిద్దాం.. కార్యక్రమాన్ని మండల తెదేపా నాయకులు గ్రామ కమిటీ అధ్యక్షుడు గొల్లూరి మంగు ఆధ్వర్యంలో నిర్వహించారు. అధికారంలో కళ్ళు మూసుకుపోయిన వైకాపా ప్రభుత్వానికి కళ్ళు తెరిపిద్దాం అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ, కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకొని ర్యాలీ నిర్వహించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా తెదేపా నాయకులు పలువురు మాట్లాడుతూ, దేశానికే టెక్నాలజీని పరిచయం చేసిన వ్యక్తి చంద్రబాబు అని కొనియాడారు. ఓటమి భయంతోనే వైసీపీ ప్రభుత్వం చంద్రబాబుపై అక్రమ కేసులు పెట్టించిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో అరకు పార్లమెంట్ టీఎన్ సెల్ అధ్యక్షులు లక్కోజు నాగభూషణం, వింతపల్లి గ్రామ కమిటీ అధ్యక్షులు రీమల ఆనంద్, బూత్ కన్వీనర్ దూలి రామకృష్ణ సేవా మిత్రలు పాల్గొన్నారు.

సొంత నిధులతో సిసి రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ : మండలంలోని సోవ్వ పంచాయితీ గొవ్వులవలసలో ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో పూర్తిస్థాయిలో సిసి రోడ్డు నిర్మించకుండా కొంతమేర నిర్మించి కాంట్రాక్టర్ అసంపూర్తిగా వదిలేశారు. దీంతో పలుమార్లు ఆ గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించు కోక పోవడంతో, సొంతంగా ఆ గ్రామస్తులే ఇంటింటికి నిధులు సమకూర్చుకొని అసంపూర్తిగా ఉన్న సిసి రోడ్డును పూర్తిగా నిర్మించుకున్నారు. అసంపూర్తిగా నిర్మించిన రోడ్డు కూడాను నాణ్యత లోపంతో ఉందని గ్రామస్తులు తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి ఈ రోడ్డు నిర్మాణం పై విచారణ చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



సిసి రోడ్డు నిర్మించుకుంటున్న గిరిజనులు

డ్రైయినేజీ పనుల పరిశీలన



డ్రైనేజ్ పనులు పరిశీలిస్తున్న జెడ్పిటిసి

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని రంగశీల పంచాయతీ నడివలస గ్రామంలో నిర్మిస్తున్న డ్రైనేజీని సోమవారం జడ్పీటీసీ రేగం మత్స్యలింగం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు ఆయన చెప్పారు.కల్వర్టు నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ తంగుల ముత్యాలమ్మ, అరకు వేలి మండలం కొత్తబల్లుగూడ ఎంపీటీసీ స్వామి రామమూర్తి, మాదల ఎంపీటీసీ స్వామి రామచందార్, మోహన్ దాసు పాల్గొన్నారు.

బిర్సా ముండా జయంతి పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అరకులోయ: స్వాతంత్ర్య సమరయోధుడు భగవాన్ బిర్సా ముండా 149వ జయంతి వేడుకలను పురస్కరించుకొని నవంబర్ 14,15 తేదీల్లో పాడేరులో ఆంధ్రప్రదేశ్ ఆదివాసి జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన జాతీయ ఆదివాసి సదస్సు సంస్కృతిక కళా ప్రదర్శనలను విజయవంతం చేయాలని అరకు లోయలో బిర్సాముండా వాల్ పోస్టర్ విడుదల చేశారు.ఈ వాల్ పోస్టర్ ను పెదలబుడు మేజర్ పంచాయతీ సర్పంచ్ పెట్టెలి దాసు బాబు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బిర్సా ముండా వంటి గిరిజన ముద్దుబిడ్డలు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనడమే కాకుండా, గిరిజనుల హక్కులు, చట్టాలపై నడిపిన ఆనాటి పోరాట ఫలితమే నేడు గిరిజనులకు చట్టాలు వచ్చాయని ఆయన అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఆదివాసి జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు లోక్యోలు మహేష్, ఆనంద్ మాట్లాడుతూ, బిర్సా ముండా జయంతి సందర్భంగా నిర్వహించే జాతీయ ఆదివాసి సదస్సులో నూతన అటవీ సంరక్షణ సవరణ చట్టం- ఆదివాసులపై ప్రభావం అనే అంశంపై చర్చ జరుగుతుందన్నారు.ఉమ్మడి పౌర స్మృతి ఆదివాసులపై ప్రభావం, ఆదివాసుల సంస్కృతిక గుర్తింపు పరిరక్షణ, సాహిత్యం, రచనలు, మన కర్తవ్యం తదితర వాటిపై చర్చ జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు నాగరాజు, ఆర్కే, చందు,దుంబ్రిగూడ మాజీ పిఎసిఎస్ చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నేతలు

శ్రమదానంతో రోడ్డు పనులు



పనులు చేపడుతున్న గిరిజనులు

ప్రజాశక్తి -అనంతగిరి: రహదారి సమస్య పరిష్కా రానికి ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో ఆయా గ్రామాల గిరిజన ప్రజలు ముందుకు వచ్చి స్వచ్ఛందంగా శ్రమదానంతో పనులు చేపట్టారు. మండలంలో మారుమూల కవర్ల పంచాయతీ కోడిల్లి, పెద్దకోట పంచాయతీ పెద్దబయలు గ్రామాలకు అనుకొని ఉన్న జలపాతాలలో సందర్శించే పర్యాటకులు, స్థానిక ప్రజల రాకపోకలకు రోడ్డు మార్గం వర్షాలకు కోతకు గురి కావడంతో రెండు గ్రామాల గిరిజన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గిరిజనులు అంతా నడుం బిగించి స్వచ్ఛందంగా ముందుకు కదలి రోడ్డు పనులు చేపట్టామని గ్రామస్తులు ఈశ్వరరావు, అప్పలనాయుడు, బుజ్జిబాబు, రాంబాబు తెలిపారు.

'సర్వీస్ నౌ'తో గీతం అవగాహన ఒప్పందం

ప్రజాశక్తి- మధురవాడ : ప్రపంచంలోని ఫార్చ్యూన్ 500 కంపెనీలలో ఒకటైన అమెరికాకు చెందిన టెక్నాలజీ కంపెనీ సర్వీస్ నౌతో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం సోమవారం అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. గీతం ప్రో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు సమక్షంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, సర్వీస్ నౌ సంస్థ వర్క్‌ఫోర్స్ డెవలప్‌మెంట్ డైరక్టర్ జి.భాస్కర్ అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు.




ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న రెండు సంస్థల ప్రతినిధులు

ఈ సందర్భంగా గీతం ప్రో వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు మాట్లాడుతూ విద్యాలయాలతో పరిశ్రమలకు మెరుగైన సంబంధాల ద్వారా కాలానుగుణంగా సిలబస్‌లలో మార్పులతో విద్యార్థులు కొత్త నైపుణ్యాలను నేర్చుకోవడానికి, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తమను తాము తీర్చిదిద్దుకోవడానికి ఈ తరహా ఒప్పందాలు దోహదపడతాయన్నారు. సర్వీస్ నౌ సహకారంతో గీతం విద్యార్థులు ప్రపంచ వ్యాప్తంగా ఉపాధి అవకాశాలు మెరుగు పరుచుకోవాలని సూచించారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరక్టర్ ప్రొఫెసర్ నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ సర్వీస్ నౌ సహకారంతో గీతం అధ్యాపకులు సమకాలీనా అంశాలపై శిక్షణ పూర్తిచేసుకున్నారని తెలిపారు. సర్వీస్ నౌ సంస్థ వర్క్‌ఫోర్స్ డవలప్‌మెంట్ డైరక్టర్ జి.భాస్కర్ మాట్లాడుతూ విద్యాలయాలు ఐటి రంగానికి తగిన నైపుణ్యాలతో విద్యార్థులను అందించడానికి, సిలబస్‌లలో మార్పులకు తాము సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో గీతం జిసిజిసి డీన్ కమాండర్ గురుమూర్తి గంగాధరన్, డీన్ ప్రొఫెసర్ సిహెచ్ విజయశేఖర్, ప్రొఫెసర్ బసవరాజు, గీతం సిఎస్ఇ విభాగం అధిపతి ప్రొఫెసర్ శిరిష పాల్గొన్నారు.

ధర్మారావుకు సాహితీ విఖ్యాత కవితా పురస్కారం

ప్రజాశక్తి- సీతమ్మధార : ఎన్‌జివోస్ కాలనీలోని జివిఎంసి పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు ఎంవి.ధర్మారావుకు సాహితీ విఖ్యాత కవితా పురస్కారం దక్కింది. కరీంనగర్‌కు చెందిన ఆర్యాణి సకల కళావేదిక ఆధ్వర్యంలో శ్రీగౌతమేశ్వర సాహితీ కళా సేవాసంస్థ ఈనెల15న అంతర్జాల వేదికగా నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి రికార్డ్ కవితల పోటీలో ధర్మారావు ఒక్కగంట వ్యవధిలో నాలుగు కవితలు రాయడం ద్వారా తనలోని సాహితీ ప్రతిభను చాటి పురస్కారానికి ఎంపికయ్యారు.కరీంనగర్ పట్టణంలో సంస్థ అధ్యక్షులు దూడపాక శ్రీధర్ నుంచి సాహితీ విఖ్యాత కవితా పురస్కారం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి, విశ్లేషకులు, భవానీ సాహితీ కళావేదిక అధ్యక్షులు వైరాగ్యం ప్రభాకర్ నుంచి స్వర్ణకంకణం గౌరవాన్ని పొందారు. గౌతమేశ్వర సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు దూడపాక శ్రీధర్, సంస్థ ప్రధాన సలహాదారు పొర్ల వేణుగోపాల్ దుశ్శాలువాతో ధర్మారావును సత్కరించారు.కార్యక్రమంలో కణిక సాహితీ ప్రక్రియ రూపకర్త రమాదేవి కొలకలూరి పాల్గొన్నారు.

యుటిఎఫ్ నూతన కార్యవర్గం



ఎన్నికైన సభ్యులు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండల కేంద్రంలో శారదనికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల వద్ద యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కే.రఘునాథ్ ఆధ్వర్యాన మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాత పెన్షన్ విదానాన్ని అమలు చేయాలన్నారు.అనంతరం. నూతన కార్యవర్గం ఎన్నికైంది. ఎన్నికల పరిశీలకులుగా జిల్లా కార్యదర్శులు కే.రఘునాథ్, ఎం.ధర్మారావులు వ్యవహరించారు. గౌరవ అధ్యక్షులుగా అప్పల నాయుడు, అధ్యక్షులుగా రాజు, ప్రధాన కార్యదర్శిగా సీసా. గోపి, కోశాధికారిగా కె.శ్రీనివాస మూర్తి సహాధ్యక్షులుగా త్రినాధమ్, ఈశ్వరమ్మ, మహిళా కన్వీనర్‌గా నవీనా, శరణి, రేవతి, సిపిఎస్ కన్వీనర్‌గా అవినాష్, జిల్లా కౌన్సిలర్స్‌గా ధర్మారావు, .కె.రఘునాథ్, కె.తిరుపతిరావు ఎన్నికయ్యారు.ముందుగా అధ్యక్షులు ఆర్ పుండరీ , ప్రధాన కార్యదర్శి ఎస్.గోపి గత ఏడాది పోరాటాలను నివేదించారు.

542 మందికి వైద్య పరీక్షలు



జగనన్న సురక్ష ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి- పెదబయలు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీపీ బోండా వరహాలమ్మ, స్థానిక సర్పంచ్ పి.మాధవరావు, జడ్పీటీసీ కూడా బొంజుబాబు ప్రారంభించారు. వారపు సంత రోజు కావడంతో సంతకు వచ్చిన ఆంధ్ర ఒడిస్సా ప్రజలు హాజరు కావడంతో విశేషం స్పందన లభించింది. 542 మంది వైద్య పరీక్షలు చేపించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎల్ పూర్ణయ్య, స్థానిక విద్యాశాఖధికారి డేవిడ్ పుష్ప, వైస్ ఎంపీపీ కొర్ర రాజాబాబు, తహసీల్దార్ శెట్టి కృష్ణారావు, వైద్యాధికారులు కృష్ణారావు, సిందూరం పడల్ పాల్గొన్నారు

నేడు రక్తదాన శిబిరం

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోనిడాక్టర్ వైఎస్ఆర్ టిఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఏడవ వార్షికోత్సవం, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యు రాలు జంపరంగి లిల్లీ జన్మదిన సందర్భంగా ఈనెల 30న మెగా రక్త దాన శిబిరం మండల కేంద్రంలోనే నిర్వహిస్తున్నట్లు అల్లూరి జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ తేడాబారిక్ సురేష్ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు పాల్గొని రక్తదానం చేసి మరొకరి ప్రాణాలు కాపాడాలని ఆయన అభ్యర్థించారు. ఒక బొట్టు రక్తం నిండు ప్రాణానికి ఊపిరి పోస్తుందన్నారు.



జెన్కో కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కుళాయిలు

తాగునీటి కుళాయిలు ఏర్పాటు

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం సీలేరు ఏపీ జెన్కో కళ్యాణ మండపంలో మంచినీటి కుళాయిలు నూతనంగా ఏర్పాటు చేశారు. సీలేరులో వివాహ శుభకార్యాలు, ఇతర కార్యక్రమాలు ఏపీ జెన్కో కళ్యాణమండపంలో నిర్వహిస్తూ ఉంటారు. కొంత కాలం క్రితం అన్ని హంగులతో ఈ కళ్యాణ మండపాన్ని ఎపి జెన్‌కో నిర్మించింది. ఫంక్షన్‌కు ఒక రోజుకు రూ.3,500, ఏపీ జెన్కో ఉద్యోగులకు అయితే రూ.3000 అద్దె వసూలు చేస్తారు. కళ్యాణ మండపం ప్రాంగణంలో వంటశాలు అరకొరగా ఉండడంతో శుభ కార్యాలు చేసేటప్పుడు అనేక సమస్యలు తలెత్తేవి. ఎట్టకేలకు జెన్‌కో ఎస్ఇ సివిల్ కెకెవి.ప్రశాంత్ కుమార్ చొరవతో వర్షం వచ్చినా వంటలకు ఇబ్బంది లేకుండా తాత్కాలికంగా రేకులతో షెడ్డు నిర్మించారు. చేతులు పరిశుభ్రపరచుకోవడానికి వాటర్ ట్యాంక్ నుంచి పైప్ లైన్ ఏర్పాటు చేశారు. ఇప్పుడు నూతనంగా కుళాయిలు ఏర్పాటు చేసి మంచినీటి సౌకర్యం కల్పించారు.

ఊట్లలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

ప్రజాశక్తి-రంపచోడవరం : మండలంలోని ఊట్ల గ్రామ పంచాయితీలో సోమవారం చంద్రన్న షూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం టిడిపి మండల అధ్యక్షులు కారం సురేష్ బాబు ఆధ్వర్యాన నిర్వహించారు. ఇందులో మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి పాల్గొని రచ్చబండ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రబాబు రూ.200 పింఛన్‌ను రూ.2000 చేసిన చేశారని గుర్తు చేశారు. ఆడపడుచులకు పసుపు కుంకుమ ద్వారా రూ.10వేలు అందించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పెంటపాటి అనంత మోహన్, కారం సింహాచలం, వై నిరంజని దేవి, మడకం బాపన్న దొర, సర్పంచ్ ముర్రం లక్ష్మి, కుంజం బాపన దొర, బుడ్డిగా రాజేంద్ర వరప్రసాద్, మడకం పండు దొర, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-రంపచోడవరం : స్థానిక ఏరియా హాస్పిటల్ సమీపంలో సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఏకలవ్య స్కూల్‌లో పనిచేస్తున్న సిహెచ్.సుధాకర్ సోమవారం ఉదయం పాఠశాలకు ద్విచక్ర వాహనంపై వెళుతున్న సమయంలో ఏరియా ఆసుపత్రి సమీపంలో ఒక కోతి అడ్డుగా రావడంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోయారు. దీంతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న సుధాకర్‌కు తీవ్రంగా గాయాలు కావడంతో అతడిని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ సుధాకర్‌కు డాక్టర్ కె లక్ష్మి సారధ్యంలో ఏవి క్రాంతి కిరణ్, సౌజన్య, తదితరులు ఆపరేషన్ చేశారు.

పోర్టులో విజిలెన్స్ వారోత్సవాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం పోర్టు అథారిటీలో విజిలెన్స్ అవగాహనా వారోత్సవాలు జరుగుతున్నట్టు పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్ తెలిపారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ ఏటా విజిలెన్స్ అవగాహనా వారోత్సవాలను నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. వారోత్సవాల్లో భాగంగా పోర్టులోని పరిపాలనా కార్యాలయ భవనంలో సమగ్రతపై పోర్టు డిప్యూటీ ఛైర్మన్ దుర్గేష్ కుమార్ దూబె, పిఎల్.స్వామి, తదితరులు ప్రతిజ్ఞ చేశారు.

ఘనంగా ఉపేంద్రగాడి అడ్డా ట్రైలర్ లాంచ్


ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎస్ఎస్ఎల్ఎస్ క్రియేషన్స్ పతాకంపై నిర్మాత కంచర్ల అచ్యుతరావు స్వీయ సమర్పణలో నిర్మించిన 'ఉపేంద్రగాడి అడ్డా' సినిమా ట్రైలర్ లాంచ్ కార్యక్రమం హోటల్ దసపల్లాలో ఘనంగా జరిగింది. హాస్య బ్రహ్మ బ్రహ్మానందం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హీరో ఉపేంద్ర నటించిన ఈ సినిమా అందరినీ ఆకట్టుకుంటుందని తెలిపారు. తన అభిమాని, నిర్మాత అచ్యుతరావు నిర్మించిన సినిమా టీజర్ విడుదల చేయడం ఆనందంగా ఉందని అన్నారు.

అప్రమత్తతపై చర్చ

రైలు ప్రమాద ఘటనపై తాజా విశ్లేషణలు - విశాఖలో పలువురికి చికిత్స
క్షతగాత్రులను చూసి కన్నీరు మున్నీరవుతున్న కుటుంబీకులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, ఎంవిపి.కాలనీ, కోటవురట్ల, సీతమ్మధార, గోపాలపట్నం, విశాఖ కలెక్టరేట్ విలేకరులు

రైలు ప్రమాదాలను నివారించడంలో సిగ్నలింగ్ వ్యవస్థ, సాంకేతిక సమస్యలు తలెత్తకుండా టెక్నాలజీ వినియోగం ఎంత ముఖ్యమో సిబ్బంది అప్రమత్తత కూడా అంతే ముఖ్యమన్న చర్చ విజయనగరం జిల్లా అలమండ - కంటకాపల్లి వద్ద ఆదివారం రాత్రి జరిగిన రైలు ప్రమాదానంతరం విశాఖ అంతటా సాగుతోంది. లోకో పైలట్లు ఎదుట కనిపించే పరిస్థితులపై తక్షణం స్పందించేతత్వం కలిగి ఉంటే కొంతమేర ప్రమాదాలను నివారించవచ్చన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. సిగ్నల్ సిస్టం ఎదురుగా ఫోకస్ అవుతున్న సమయంలో షార్ట్ కట్ పద్ధతుల్లో ఆలోచించడం కూడా ఇలాంటి ఘటనలకు ఆస్కారమిస్తుందన్న అంచనాను రైల్వే ఉన్నతాధికారులు వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా వుండగా కేంద్ర రైల్వే శాఖ రైలు ప్రమాదాల నివారణకు అనుసరిస్తున్న విధానంపై వాల్తేరు రైల్వేలో గుసగుసలు వినిపిస్తున్నాయి. కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) ఇదివరకే ఇచ్చిన నివేదికలో రైలు ప్రమాద వ్యవహారాలు, కేసుల్లో 65 శాతం మేర సరైన విచారణా నివేదికలను తయారు చేయలేదనేది స్పష్టమైన విషయం తెలిసిందే. దీంతో భద్రతకు రైల్వే మంత్రిత్వ శాఖ ప్రాధాన్యతన్విడం లేదన్న విషయం ప్రస్ఫుటమవుతోంది. రైల్వే ఎక్విప్‌మెంట్ సరిగా పనిచేయకపోవడం కూడా ప్రమాదాలకు కారణమని కాగ్ తన నివేదికలో వెల్లడించినా కేంద్ర ప్రభుత్వం ఎలాంటి ముందు జాగ్రత్త చర్యలూ, టెక్నాలజీని అప్‌గ్రేడ్ చేసేందుకు నిధుల కేటాయింపులూ చేయడం లేదన్నది స్పష్టమవుతోంది.



విశాఖ రైల్వే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

డిఎంయు పెట్టెలు తేలిక

ప్రమాదం జరిగిన వెంటనే డిఎంయు పెట్టెలు (బోగీలు) తేలిక కావడంతో ఒకదానిపై ఒకటి ఎక్కేశాయని ఈ ప్రమాద ఘటనబట్టి తెలుస్తోంది. ఇంజిన్ బరువు వల్ల బలంగా గుద్దేయడంతో ఇలా బోగీలు అతలాకుతలమై ఒకేసారి 13 మంది ప్రాణాలను బలిగొన్న పరిస్థితి ఏర్పడినట్టు చెబుతున్నారు.

రైల్వే ఆసుపత్రిలో గ్యాంగ్‌మ్యాన్లకు చికిత్స

ఆదివారం రాత్రి జరిగిన రైలు ప్రమాదంలో ఇద్దరు గ్యాంగ్‌మ్యాన్లకు తీవ్ర గాయాలవగా వారు విశాఖ రైల్వే ఆసుపత్రిలో చేరారు. మర్రిపాలెం రైల్వేక్వార్టర్స్‌కు చెందిన పంచాది శ్రీనివాసరావుకు ఈ ప్రమాదంలో వెన్నుపూసపై బలమైన దెబ్బతగిలింది. గోపాలపట్నం సమీపంలోని కొత్తపాలెంలో నివాసముంటున్న మరో గ్యాంగ్‌మ్యాన్ బొడ్డేపల్లి తేజేశ్వరావు ముక్కుకు తీవ్రంగా గాయమైంది. వీరిద్దరిదీ శ్రీకాకుళం. సోమవారం వీరిద్దరికీ సెలవు అయినందున రాయగడ పాసింజర్‌లో ఆదివారం శ్రీకాకుళం బయల్దేరారు. ఈలోగా ఏడు గంటల సమయంలో రాయగడ నుంచి వచ్చే ఎక్స్‌ప్రెస్ రైలు గట్టిగా ఢీకొనడంతో వీరూ గాయాలపాలయ్యారు.

'ఏం జరుగుతుందో అర్థం కాలేదు'

సరిగ్గా 6.50 నిమిషాల సమయంలో పెద్ద శబ్దం వచ్చిందని, తాము ప్రయాణిస్తున్న బోగీలు తీవ్రస్థాయిలో కదిలిపోవడంతో భయాందోళనకు గురయ్యామని, చాలా మంది పాసింజర్లు హాహాకారాలు చేశారని శ్రీనివాసరావు, బొడ్డేపల్లి తేజేశ్వరరావు 'ప్రజాశక్తి' ఎదుట తెలిపారు. 'మేము కూడా ప్రాణ భయంతో బిక్కుబిక్కుమంటూ ఒక మూలన పడిపోయాం' అని అక్కడి ఘోర సంఘటనను విడమర్చి చెప్పారు. తొలుత ఏం జరిగిందో తమకు అర్థం కాలేదని, గాయాలతో బయటపడి ఆసుపత్రిలో చేరామని అన్నారు. లోకోపైలట్ సిగ్నల్‌ను సరిగా చూడకపోవడంతో ఈ ప్రమాదం జరిగి ఉంటుందని పలువురు మాట్లాడుకోవడం విన్నామని చెప్పారు.

కెజిహెచ్‌లో క్షతగాత్రులు

రైలు ప్రమాదంలో గాయపడిన వారిని మెరుగైన చికిత్స కోసం విశాఖకు తరలించారు. వీరిలో శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన రైల్వే గార్డ్ మరిటి శ్రీనివాసరావు (53) మార్గం మధ్యలో అర్ధరాత్రి వేళ మృతిచెందాడు. ఆయన మృతదేహానికి విశాఖ కెజిహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహించారు. కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న వారిలో విజయనగరం జిల్లా జామికి చెందిన నల్ల కుమారి, విశాఖపట్నం జిల్లా గాజువాకకు చెందిన ఎం.లక్ష్మి, శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఎం.వరలక్ష్మి, గొట్ట కమలమ్మ ఉన్నారు. వీరందరికీ ఆర్థోపెడిక్ వార్డులో చికిత్స అందిస్తున్నారు.

లోకో పైలెట్ మృతి, కోటవురట్లలో విషాదఛాయలు

ఈ ప్రమాదంలో విశాఖపట్నంలోని ఎన్ఎడి ప్రాంతంలో నివాసముంటున్న రాయగడ ప్యాసింజర్ లోకో పైలట్ ఎస్.మధుసూదన్ రావు అలియాస్ నాయుడు (52) మృతి చెందినట్లు రైల్వే అధికారులు ధ్రువీకరించారు. ఆయన అనకాపల్లి జిల్లాలోని కోటవురట్ల మండలం తంగేడు గ్రామానికి చెందినవాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మధుసూదనరావు మృతితో మండలంలోనూ, గ్రామంలోనూ విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయన 30 సంవత్సరాల నుంచీ రైల్వేలో పనిచేస్తున్నారు. ఇటీవలే లోకో పైలట్‌గా ఉద్యోగోన్నతి పొందారు. ప్రతి ఒక్కరితో ఆప్యాయంగా ఉండే ఆయన మృతిని గ్రామస్తులు జీర్ణించుకోలేకపోతున్నారు.

రైల్వే మంత్రి రాజీనామా చేయాలి : సిపిఎం

ఘోర రైలు ప్రమాదానికి బాధ్యత వహిస్తూ కేంద్ర రైల్వే శాఖ మంత్రి తన పదవికి రాజీనామా చేయాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు పార్టీ తరుపున ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేశారు. ఈ ప్రమాదానికి కేంద్ర బిజెపి ప్రభుత్వానిదే బాధ్యతన్నారు. ప్రమాదంలో మరణించిన ప్రతి కుటుంబానికీ కేంద్రం రూ.50 లక్షలు నష్ట పరిహారం చెల్లించాలని, తీవ్రంగా గాయపడిన వారికి రూ. 25 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. క్షతగాత్రులందరికీ మెరుగైన వైద్యాన్ని కార్పొరేట్ హాస్పిటల్స్‌లో అందించాలని కోరారు. పెరుగుతున్న రైలు ప్రమాదాలకు కేంద్ర బిజెపి ప్రభుత్వ ప్రైవేటీకరణ విధానాలే కారణమన్నారు.

ప్రైవేటీకరణ విధానాలపై 27, 28న మహాధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రైవేటీకరణ విధానాలు విడనాడాలంటూ నవంబరు 27, 28 తేదీల్లో విజయవాడలో జరుగనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు పిలుపునిచ్చారు. దేశంలో ప్రైవేటీకరణ విధానాలను అమలు చేస్తున్న మోడీ ప్రభుత్వానికి వత్తాసు పలుకుతున్న వైసిపి, తెలుగుదేశం, జనసేన పార్టీలను ఎన్నికల్లో ఓడించాలని అన్నారు. సోమవారం విశాఖలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో జరిగిన సిఐటియు జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అన్ని తరగతుల ప్రజానీకం మీదా తన దాడిని ఎక్కుపెట్టిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా కార్పొరేట్లకు అప్పగిస్తోందని తెలిపారు. విశాఖ ఉక్కు పరిశ్రమను అమ్మేయడానికి కుట్రలు పన్నుతోందని అన్నారు. రైతాంగానికి, వ్యవసాయ కార్మికులకు నష్టం చేసే విధంగా పలు చర్యలు చేపడుతోందని తెలిపారు. ఈ క్రమంలో స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, కార్మికులకు నష్టం చేసే నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, రైతు పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని, ప్రజలకు నష్టం చేసే విద్యుత్ సవరణ చట్టం - 2020ని రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలన్న డిమాండ్లతో దేశంలోని అఖిలపక్ష కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్తంగా నవంబరు 26, 27, 28 తేదీల్లో అన్ని రాష్ట్రాల్లో మహాధర్నాలు జరపాలని పిలుపునిచ్చాయన్నారు. అందులో భాగంగానే ఎపిలో ధర్నా జరుగనుందన్నారు. సమావేశంలో సిఐటియు జిల్లా, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెఎం.శ్రీనివాస్, ఆర్‌కెఎస్‌వి.కుమార్, నాయకులు ఎస్.జ్యోతీశ్వరరావు, బి.జగన్, ఎ.సీతాలక్ష్మి, జి.మంగశ్రీ, జి.అప్పలరాజు, జి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. సిపిఎం ప్రజా రక్షణ భేరి బస్సు యాత్రను, నవంబరు 15న విజయవాడలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని కౌన్సిల్ తీర్మానించింది.

అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగరాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నట్టు మేయర్ గొలగాని హరి వెంకట కుమారి తెలిపారు. సోమవారం ఆమె మూడో జోన్ పరిధిలో 16, 18, 19 వార్డుల్లో పలు అభివృద్ధి పనులకు వైసిపి తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త, పార్లమెంటు సభ్యులు ఎంవివి.సత్యనారాయణ, ఆయా వార్డు కార్పొరేటర్లు మొల్లి లక్ష్మి, అప్పారావు, నొల్లి నూకరత్నంలతో కలిసి శంకుస్థాపన చేశారు. వీటిలో రక్షణ గోడ, శ్మశాన వాటిక, సిసి రోడ్లు పనులు ఉన్నాయి. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ విజయలక్ష్మి, కార్యనిర్వాహక ఇంజినీరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సిఎంకు ఘన స్వాగతం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విజయనగరం జిల్లా కంటకాపల్లి వద్ద ఆదివారం రాత్రి జరిగిన రైలు ప్రమాద ప్రాంతానికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వెళ్లేందుకుగాను సోమవారం మధ్యాహ్నం 1.16 గంటలకు ప్రత్యేక విమానంలో ఆయన విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు. అనంతరం అన్ని పనులూ ముగించుకుని 3.47కి విజయవాడకు తిరుగు ప్రయాణమయ్యారు. సిఎంకు పలువురు ఘన స్వాగతం పలికారు. నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, సిపి ఎ.రవిశంకర్, జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మ, ఎంపీ ఎంవివి.సత్యనారాయణ, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, డిసిసిబి చైర్మన్ కోలా గురువులు తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

26 కులాలను బిసి జాబితాలో చేర్చాలని ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన వెంటనే బిసి కమిషన్ నివేదిక లేకుండానే 26 బిసి కులాలను బిసి జాబితా నుంచి కెసిఆర్ ప్రభుత్వం తొలగించిందని, వాటిని తిరిగి చేర్చాలని డిమాండ్ చేస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఉత్తరాంధ్ర ప్రజా పార్టీ నాయకులు కర్రి ఆదిబాబు, మెట్ట రామారావు, ఎద్దు శ్రీలక్ష్మి ఆధ్వర్యాన సోమవారం ధర్నా నిర్వహించారు. ఆయా కులాలను తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ ఎనిమిదేళ్లుగా పోరాటం సాగుతున్నా కెసిఆర్ ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ ఉత్తరాంధ్ర నాయకులు ఇలాపండ చంద్రశేఖర్, కూన రామారావు పాల్గొన్నారు.

ఫెవికాల్ రెలామ్‌తో ఫర్నీచర్‌కు జీవం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఇంటి అలంకరణకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా ఫెవికాల్ రెలామ్‌తో ఫర్నీచర్‌ను అందంగా పునరుద్ధరించుకోవచ్చునని ఫెవికాల్ రెలామ్ ప్రతినిధి తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫెవికాల్ రెలామ్ ఉపయోగించి లామినేట్ పై లామినేట్‌ను అతికించవచ్చునన్నారు.